



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 325 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 13-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

**హైదరాబాద్ మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు.



-మిగతా 2 లో

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్న షెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక



**ముంబై, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. అయితే హర్మూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం.

-మిగతా 2 లో



### బీఆర్ఎస్ ఫిరాయింపు
## ఎమ్మెల్యేల కేసు క్లోజ్

- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం

-మిగతా 2 లో

### ప్రపంచానికే వైద్య సేవలు
# అందించాలి


**ఆ దిశగా రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది**


- ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి
- మానవతా దృక్పథంతో వైద్యం అందించాలి
- ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలి
- మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవ్వాలి
- మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో సీఎం

**విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత**

**మణికొండ మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విద్య, వైద్యం, వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచానికి వైద్య సదుపాయం అందించే కేంద్రంగా మన రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి రాష్ట్రంలోనే జరుగుతోందని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రపంచవ్యాప్తంగా నాలుగు కోవిడ్ టీకాలు ఉత్పత్తి అయితే అందులో మూడు టీకాలు మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేశామని తెలిపారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యులు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు.వైద్యులు, వైద్య సిబ్బంది ప్రవర్తన ద్వారా కూడా రోగి ఎంతో ఉపశమనం పొందుతాడని అన్నారు.

-మిగతా 2 లో




## యుద్ధం ఆపేస్తాం

- కానీ మూడు షరతులున్నాయి
- యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే
- అప్పడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొననసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు

**టెహ్రాన్,**
ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

-మిగతా 2 లో

## దేశంలో గ్యాస్ సంక్షోభం

- కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ
- పరిస్థితులపై అధికారుల సమీక్ష




2 లో



### తెలంగాణలో కమర్షియల్
## సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్

-మిగతా 2 లో

## తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

- తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన
- నిబంధనల మేరకే నడచుకున్నానని వెల్లడి

**న్యూఢిల్లీ**
విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం

-మిగతా 2 లో



### ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో
## ఆర్టీసీని ప్రయివేటీకరించే కుట్ర

- మహాలక్ష్మి పథకం కింద రూ.2,804 కోట్ల బకాయిలను విడుదల చేయాలి
- ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా : మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తానని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు ఆయన్ను కలిసి, ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యలను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని


-మిగతా 2 లో



### మన విదేశాంగ విధానం
## అమెరికాకు తకట్టు

**ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి**

- ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి.

-మిగతా 2 లో

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

(మొదటి తరువాయి)

అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

(మొదటి తరువాయి)

హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ , ట్రాన్స్‌పాండర్లను స్విచ్చాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సింధు భారతీయుడే కావడం విశేషం.

## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

(మొదటి తరువాయి)

లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వి వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇష్టపికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

(మొదటి తరువాయి)

బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

(మొదటి తరువాయి)

సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# ప్రపంచానికే వైద్య సేవలు అందించాలి

(మొదటి తరువాయి)




రాష్ట్రంలో మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలని, అప్పుడే ఆయా కుటుంబాలు పుష్టిగా ఉంటాయని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా నానక్‌రామ్‌గూడలోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ పరిధిలో మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్ రఘువీర్ రెడ్డి, మెడికవర్ ఆస్పత్రి చైర్మెన్ అనిల్ కృష్ణతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం ప్రసంగించారు. మెడికవర్ ఆస్పత్రి 2014లో ప్రారంభమై 12 ఏండ్లుగా ఉత్తమ సేవలు అందించడం వల్లనే దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. మానవత్వంతో కూడిన వైద్య సదుపాయం అందించినప్పుడే రోగులు సంతృప్తి చెందుతారని తెలిపారు. 550 బెడ్లు, 18 ఆపరేషన్ థియేటర్లతో ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫార్మా ఇండస్ట్రీలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మందుల ఉత్పత్తిలో మన రాష్ట్రానికి 40 శాతం వాటా ఉందన్నారు. వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రయివేట్ వైద్యులు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడాదిలో కనీసం ఒక నెల పనిచేయాలని అన్నారు. అప్పుడే వైద్యులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆస్పత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఇటువంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎంతో సహాయపడతాయని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జి. అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ.. 640–స్లైస్ సీటీ స్కాన్, వేగవంతమైన హార్ట్ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో ఖచ్చితమైన నిర్ధారణ చేసి రోగులకు సమయానికి చికిత్స అందించొచ్చని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరికృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయి వైద్య సేవల అవసరం పెరుగుతోందని, ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డైరెక్టర్ డా. ఎ.ఆర్. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ఆధునిక వైద్య పరికరాలు, సమగ్ర వైద్య విధానాలతో ఈ ఆస్పత్రి రోగులకు వేగవంతమైన, సమర్థవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# యుద్ధం ఆపేస్తాం

(మొదటి తరువాయి)

పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

# దేశంలో గ్యాస్ సంక్షోభం

### కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ పరిస్థితులపై అధికారుల సమీక్ష




**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయా' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

### ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో

## ఆర్టీసీని ప్రయివేటీకరించే కుట్ర

(మొదటి తరువాయి)

హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఒకవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతున్నారని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఒక్కొక్క విభాగాన్ని ప్రయివేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. ప్రయివేట్ కంపెనీలతో ఏకంగా రెండు వేల బస్సుల సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదని వివరించారు. ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ కంకణం కట్టుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీలను నేరుగా ఆర్టీసీకే ఇప్పించి, సంస్థ సొంతంగా బస్సులు కొనుగోలు చేసుకునేలా పథకంలో సవరణలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తామంటూ ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. ఇపుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయమని విమర్శించారు. గత రెండేండ్లుగా ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిల భారాన్ని ఆర్టీసీపైనే మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇప్పటికీ రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయనీ, 2025 పీఆర్సీ సైతం అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న పొదుపు మొత్తాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలలుగా వడ్డీ చెల్లించడం లేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణం పథకం సజావుగా సాగుతోందని డబ్బా కొట్టుకుంటున్న ప్రభుత్వం రద్దీకి సరిపడా కొత్త బస్సులు కొనడంలో, సిబ్బందిని నియమించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సిబ్బంది కొరతతో ఉన్న కార్మికులపై తీవ్ర పని భారం పడుతోందనీ, ఆ ఒత్తిడి వల్ల కార్మికులు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వివరించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## మన విదేశాంగ విధానం అమెరికాకు తకాట్టు

(మొదటి తరువాయి)

ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్మూజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# కార్పొరేటర్లు, కౌన్సిలర్ల శిక్షణలో కలెక్టర్ దిశానిర్దేశం



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణాల అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే జిల్లా అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రభుత్వ పథకాలు, మున్సిపల్ చట్టాలు, విభాగాల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్డు స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, శానిటేషన్ పర్యవేక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం, ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రజా సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవినీతి రహిత పాలనతో ఆదర్శంగా నిలవాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి డివిజన్‌లో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.డిప్యూటీ మేయర్ సునీల్ రావు కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజా సమస్యలు తెలుసుకొని మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కమిషనర్ ప్రపుల్ దేశాయ్ మున్సిపల్ చట్టాలు, విభాగాల పనితీరుపై అవగాహన పెంచుకోవడం అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, హుజురాబాద్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, జమ్మికుంట చైర్మన్ ప్రశాంత్ కుమార్, చొప్పదండి చైర్పర్సన్ వడ్లూరి సరితతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# జెడ్‌పీహెచ్ఎస్లో వార్షికోత్సవ సంబరాలు



**గంగాధర, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని బూరుగుపల్లి జెడ్‌పీహెచ్ఎస్‌లో వార్షికోత్సవం మరియు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో రాము మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ ఏకాగ్రతతో చదివితే ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో గౌరవం పొందగలరని సూచించారు. సర్పంచ్ కళ్యాణ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేసి, మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ.5000 బహుమతి ప్రకటించారు. కార్యక్రమంలో కొండయ్యపల్లి సర్పంచ్ వినయ్ సాగర్, ఉప సర్పంచ్ తిరుపతి, ఏఏపీసీ ఛైర్పర్సన్ మాధవి, విలేజ్ సెక్రటరీ, వార్డ్ మెంబర్లు, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

# ముందస్తు అడ్మిషన్లపై అధికారులు స్పందించాలి



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు ఉన్నప్పటికీ అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. మయూరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల కాకముందే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం, సీట్లు అయిపోతాయని భయపెట్టడం పూర్తిగా అక్రమమని పేర్కొన్నారు. ఈ విధానం పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారమై, విద్యను వ్యాపారంగా మార్చిందని అన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలను మూసివేయాలని, అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ముందస్తు అడ్మిషన్ల మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా యూఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బుస మనితేజ, అభిలాష్, జీవన్, శన్విత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా పొన్నం అశోక్ గౌడ్ విజయం



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా పొన్నం అశోక్ గౌడ్ గెలుపు సాధించిన సందర్భంగా కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదుల సమావేశ మందిరంలో సంబరాలు జరిగాయి.జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి, అశోక్ గౌడ్ విజయం కోసం కృషి చేసిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భుక్య రజనీస్, కొత్త ప్రకాశ్, కొత్తకొండ శంకర్, సృజన్, గౌతం రాజ్, సీనియర్ న్యాయవాదులు పి. ప్రభాకర్ రావు, కూర శ్రీనివాస్ రెడ్డి, బొమ్మ పవన్, పి. సజన్, బి. నర్సింహ రెడ్డి, టి. పవన్, దేవ కిషన్, కే. భూమయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్



**గంగాధర, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని అగ్రవర్ణాల పేదల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి. రెడ్డి కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.దేశంలో అగ్రవర్ణాల జనాభా 65 కోట్లకు పైగా ఉన్నప్పటికీ, వారిలో 80 శాతం మంది పేదరికంలో జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అగ్రవర్ణ పేదలకు ఎటువంటి రిజర్వేషన్లు, ప్రభుత్వ ప్రయోజనాలు లభించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అగ్రవర్ణాల పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజ్యాంగ హోదా కల్పించాల్సిన అవసరం ఉందని, తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

# కవ్వంపల్లి పదవీ స్వీకారోత్సవానికి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు




**మానకొండూర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించగా, కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లి సంబరాలు జరిపారు. మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బస్సులు, వ్యాన్లు, కార్లలో హైదరాబాద్ చేరుకుని కవ్వంపల్లి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.పదవీ స్వీకారానికి ముందు కవ్వంపల్లి గన్‌పార్క్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గౌరవం తెలిపారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గన్‌పార్క్ నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, బాణసంచా పేలుళ్లు, జైజై నినాదాలతో మూడు గంటల పాటు ర్యాలీ ఉత్సాహంగా సాగింది.

# సింగరేణి కార్మికులకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



**మంథని, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సింగరేణి కంపెనీలో కార్మికుల హక్కుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, అవసరమైతే సమ్మె చేపట్టాలని బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.గత కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు చిన్న చిన్న సమస్యలకు పోరాటం చేయడం కాకుండా, మెడికల్ బోర్డు కోసం సమగ్రంగా ఉద్యమించాలని సూచించారు.కారుణ్య నియామకంలో రెండు సంవత్సరాల కాలపరిమితి పెట్టడం సరైంది కాదని, ఒక్కరోజు పనిచేసినా మెడికల్ అన్‌ఫిట్ అయితే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక హక్కులను పట్టించుకోవడం లేదని, సింగరేణి కంపెనీలో 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నా సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమని విమర్శించారు.మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం కార్మిక సంఘాలు సమ్మె చేయాలని, ఈ అంశాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని శ్రీనివాస్ తెలిపారు.

# అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని బిక్షాటన



**బెల్లంపల్లి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్ పట్టణంలో జోలె పట్టి బిక్షాటన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా విడుదల చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో అవకతవకలు జరిగాయని, లంచాలు వసూలు చేసి కేటాయింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. నిరుపేదలు లక్షల రూపాయలు చెల్లించే స్థితిలో లేరని, వారి పక్షాన బీజేపీ పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, పట్టణ కోశాధికారి సంతోష్ అగర్వాల్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి, పుల్లూరి రాము, పుల్లె ప్రశాంత్, ఎర్రోజు శ్రీనివాస్, జంగంపల్లి సాగర్, పోలోజు సందీప్, గాదసూర్య తేజ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు


**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళలకు స్వయం ప్రతిపత్తి, కరీంనగర్‌లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గ్రీన్ కెమిస్ట్రీ ఇన్ యాక్షన్ ట్రాన్స్ఫార్మింగ్ అప్లైడ్ సైన్సెస్ ఫర్ ఏ బెటర్ టుమారో" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. సాతావాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన గ్రీన్ కెమిస్ట్రీ పర్యావరణ పరిరక్షణలో కీలకమని, శాస్త్రవేత్తలు సుస్థిర అభివృద్ధి కోసం పర్యావరణ హిత పరిశోధనలు చేయాలని సూచించారు. గౌరవ అతిథిగా డాక్టర్ సరసిజ విద్యార్థులకు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ముఖ్య ప్రసంగకర్తగా ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య గ్రీన్ కెమిస్ట్రీలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, పరిశ్రమలలో వాటి అనువర్తనాలపై




వివరించారు. అలాగే ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ డి. కాశీనాథ్, డాక్టర్ పెర్గు శ్యామ్ పర్యావరణ హిత రసాయన ప్రక్రియల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అఫ్సారి ఉస్మాని మార్గదర్శకత్వంలో జరిగింది. కన్వీనర్ జి. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆర్. మొగిలి బాధ్యతలు నిర్వర్తించారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని నిపుణుల ఉపన్యాసాలను ఆసక్తిగా ఆలకించారు. గ్రీన్ కెమిస్ట్రీ ద్వారా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి సాధనలో శాస్త్రవేత్తల పాత్రపై ఈ సదస్సు అవగాహన కల్పించింది.

## బార్ కౌన్సిల్ సభ్యుడు పొన్నం అశోక్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌ను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అశోక్ గౌడ్ సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌ను ఒక మోడల్‌గా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తారని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని సిరాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన బార్ కౌన్సిల్‌కు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి సరసమైన ధరలకు సరుకులు అందించాలి





**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: వంటగ్యాస్ ధరలు పెరగడంతో పాటు బ్లాక్ మార్కెట్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సరసమైన ధరలకు గ్యాస్ సిలిండర్లు మరియు ఇతర అవసరమైన సరుకులు అందించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల తర్వాత బడా వ్యాపారస్తులు లాభాపేక్షతో బ్లాక్ మార్కెట్ సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. సిలిండర్లు దొరకక హోటళ్లు మూతపడుతున్నాయని, చిన్న వ్యాపారులు, అసంఘటిత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గృహ వినియోగదారులు బుక్ చేసినా సిలిండర్లు ఆలస్యంగా వస్తున్నాయని, వ్యవసాయ రంగానికి కూడా ఎరువుల కొరత సమస్యగా మారుతోందని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని, దాంతో రవాణా ఖర్చులు పెరిగి ప్రజలకు మరింత భారమవుతుందని ఆయన హెచ్చరించారు. రైతుల నుండి సరుకులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ వ్యాపారస్తులు లాభాలు పొందుతున్నారని, ఈ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం యుద్ధాన్ని సాకుగా చూపుతోందని విమర్శించారు.

## వంటగ్యాస్ కొరత లేకుండా చూడాలని డిమాండ్



**హుస్నాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంటగ్యాస్‌ను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ అందించాలని హుస్నాబాద్ బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో గ్యాస్ ఏజెన్సీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ బుకింగ్‌లో సర్వర్ సమస్యల కారణంగా ప్రజలు గంటల తరబడి ప్రయత్నించినా గ్యాస్ బుకింగ్ జరగక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేదని చెబుతున్నా, పట్టణాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దళారీలు ఎల్పీజీని బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందకపోవడం వల్ల ప్రజలు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ నిరసనలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణనిచ్చిన సర్పంచ్



**హుస్నాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అక్కన్నపేట మండలంలోని పంతులు తండా సర్పంచ్ లావుద్య చిన్న నాయక్ పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు భవిష్యత్తును నిర్మించుకునే అవకాశమని, కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ఉత్సాహపరిచారు. పరీక్షల సమయంలో రవాణా సౌకర్యం కల్పిస్తామని, పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి మరియు తిరిగి రావడానికి అయ్యే ఖర్చులను తానే భరిస్తానని ప్రకటించారు. విద్యార్థులు తమ కలలను నిజం చేసుకోవాలని, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరీరామ్ జగ్మాల్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ పాదయాత్ర సన్నాహక సమావేశం



**సిరిసిల్ల, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి హాజరై, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ మార్చి 14న ఉదయం 6 గంటలకు కరీంనగర్ మహాశక్తి అమ్మవారు ఆలయం నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వరకు 40 కిలోమీటర్ల పాదయాత్ర చేపడతారని తెలిపారు. ఈ పాదయాత్ర విజయవంతం కావడానికి గంభీరావుపేట మండలంలోని బీజేపీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవస్థానం కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు నర్సింలు, దేవరాజు, నాయకులు డాక్టర్ సత్యనారాయణ, దేవరాజు రవీందర్, నర్సింలు, దేవేందర్ యాదవ్, రవీందర్ నాయక్, ఎల్లం నరేష్, భాస్కర్ నాయక్, రాజు తిరుపతి, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ మంథని వార్షికోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




**మంథని, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జేఎన్టీయూ మంథని కళాశాలలో నూతనంగా నిర్మించిన సివి రామన్ ఆడిటోరియంను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. అనంతరం కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 16 సంవత్సరాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుమతులతో మంథనిలో జేఎన్టీయూ కళాశాల ఏర్పాటైన విషయాన్ని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతంలో కళాశాల ఏర్పాటు సరికాదని కొందరు విమర్శించినా, ఇక్కడ చదివిన విద్యార్థి యుపిఎస్సీ ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి ప్రాంతానికి గుర్తింపు తెచ్చాడని తెలిపారు. టెక్నాలజీ వేగంగా మారుతున్న ఈ కాలంలో విద్యార్థులు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, కష్టపడి పనిచేసే తత్వం కలిగి ఉండాలని సూచించారు. త్వరలో మంథని నియోజకవర్గంలో మరో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. తరువాత గుమ్మునూర్--కాకర్లపల్లి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, రూ.3.75 కోట్ల డీఎంఎఫ్ నిధులతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గుమ్మునూర్ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు అహర్నిశలు కృషి చేయాలని సూచించారు.

## గ్రామాల స్వయం సమృద్ధి కోసం సర్పంచుల కృషి అవసరం



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి గ్రామాల స్వయం సమృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. తిమ్మాపూర్ మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సర్పంచులకు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయ--వ్యయాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా విద్య, వైద్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పన్నుల వసూలుతో పాటు సొంత ఆదాయం పెంచుకోవాలని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభించామని, సర్పంచులు చురుకుగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గ్రామాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందినవారి సహకారం తీసుకొని పంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఆర్డిఓ శ్రీధర్, డీఏవో భాగ్యలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ పాదయాత్ర విజయవంతానికి సన్నాహక సమావేశం



**హుస్నాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్కతుర్తి మండలంలో బీజేపీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పాదయాత్ర విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం జరిగింది.కరీంనగర్ మున్సిపాలిటీ, సర్పంచ్, వార్డ్ మెంబర్ ఎన్నికల విజయోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ శక్తిపీఠం నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర చేసి ఆంజనేయ స్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్ణయించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మంది చొప్పున మొత్తం 250 మంది కరీంనగర్ చేరి పాదయాత్రలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సూరారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తక్కలపల్లి సంపత్ రావు (కబడ్డీ సంపత్ రావు)ను బీజేపీలోకి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు చిదురల వెంకటేష్, మాజీ సర్పంచులు శ్యామల సురేష్ రెడ్డి, కుడుతాడు రాజు, చల్ల రవీందర్ రెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జ్ ఠాకూర్ శామ్ సింగ్, సింగణబోయిన రాజు, అంబీర్ శ్రీనివాస్, బీట్ల లింగయ్య, చదిరం రాకేష్, కొలిపకా శ్రీనివాస్, వీరమళ్ళ కృష్ణారెడ్డి, బొక్కలపాటి కుమార్, కొమ్మిడి లచ్చిరెడ్డి, ముప్పు రమేష్, సల్పాల కిరణ్, సిద్దు, గానబోయిన నాగరాజు, ఆర్ఎంపీ రంజిత్, కనుకుంట్ల రమణాచారి, విద్యాసాగర్, తోట మల్లయ్య, అల్లి కుమార్, గొర్రె ప్రవీణ్, వడ్లకొండ రమేష్, గూడెం నాగరాజు, నరేడ్ల శంకర్, సాతూరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అవగాహన సమావేశం



**సిద్దిపేట, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన సిద్దిపేట సంక్షేమ సంఘ భవనంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై అవగాహన సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని, 99 రోజుల కార్యాచరణను ఐదు అంచెల్లో అమలు చేస్తున్నట్లు వివరించారు.మార్చి 6 నుండి జూన్ 12 వరకు పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణ, రహదారి భద్రత, సంక్షేమ పథకాలు, వ్యవసాయం, విద్య, యువత--క్రీడలు, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా చూడాలని సూచించారు.ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ముందుగా ప్రజాప్రతినిధులనే సంప్రదిస్తారని, అందువల్ల వారు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్య, వైద్యం, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పౌరసరఫరాలు, రోడ్డు భద్రత, పర్యావరణం, ఇందిరమ్మ గృహాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సునీల్ రావు



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరపాలక సంస్థ మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా మెగా హెల్త్ క్యాంపు



**పెద్దపల్లి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి పట్టణ 9వ వార్డులో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ నూగిల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ, ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులతో క్యాంపు ఏర్పాటు చేయడం సంతోషకరమని, 9వ వార్డు ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జన్న సహకారంతో కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో అన్ని రకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, ప్రసవాలు జరుగుతున్నాయని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. తరువాత చైర్మన్, కౌన్సిలర్లను డీఎంహెచ్ఓ ప్రమోద్ శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాదీమ్, తూముల లత సుభాష్, నల్లాల పద్మ సురేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్ష

# పదవి పోటీలో ముగ్గురు అభ్యర్థులు

హైదరాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో ఉపసంహరణల అనంతరం ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. అమరవాది లక్ష్మీనారాయణ, బుస్స శ్రీనివాస్, మిడిదొడ్డి శ్యామ్‌సుందర్ ఈ ఎన్నికల్లో బరిలో ఉన్నారు.మార్చి 17వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమై అనంతరం విజేత అభ్యర్థి పేరును ప్రకటించనున్నారు.హైదరాబాద్ లక్డికాపూల్‌లోని వాసవి సేవా కేంద్రం, వాసవి కళ్యాణ మండపంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1109 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# అక్రమంగా ఎల్పీజీ సిలిండర్ల వినియోగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కరీంనగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్పీజీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా హోటళ్లు, ప్రైవేట్ హాస్టల్స్, రెస్టారెంట్లలో వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు.నిరుపేదలకు చెందాల్సిన రాయితీ సిలిండర్లు అక్రమంగా వాడుకోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, నిజమైన లబ్ధిదారులకు సిలిండర్లు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్--మాస్ లైన్ ప్రజా ప్రంథా అనుబంధం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ కూడా ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



**మంచిర్యాల, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని అమ్మ గార్డెన్స్‌లో సర్పంచులు, మేయర్లు, చైర్‌పర్సన్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ కార్యక్రమం అమలవుతుందని తెలిపారు.గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, త్రాగునీటి పైప్‌లైన్ మరమ్మత్తులు, విద్యా రంగ అభివృద్ధి, రేషన్ కార్డుల మంజూరు, మాదకద్రవ్యాల నిరోధం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడాలని, ఒకసారి లబ్ధి పొందిన వారిని మళ్లీ జాబితాలో చేర్చకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. వేసవిలో నీటి సరఫరా, విద్యుత్ వినియోగ నియంత్రణ కోసం సౌర దీపాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారం, రహదారి భద్రత, గ్రామాభివృద్ధి, మున్సిపల్ నిధుల వినియోగం వంటి అంశాల్లో ప్రజాప్రతినిధులు సమర్ధవంతంగా వ్యవహరిస్తే ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, డిసిపి ఎ. భాస్కర్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాము కాటుతో ఆవు, లేగదూడ మృతి



**హుస్నాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో పాము కాటుతో ఒక ఆవు, లేగదూడ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన రైతు కొమ్మడిబోయిన రమేష్ పొలంలో ఉన్న ఆవు, లేగదూడకు పాము కాటేయడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయని తెలిపారు. జీవనోపాధి కోసం ఆవులపై ఆధారపడిన తాను ఒక ఆవు, లేగదూడను కోల్పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక ఆవు విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని, ఈ నష్టాన్ని భరించడం కష్టమని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని రైతు రమేష్ విజ్ఞప్తి చేశారు.

# కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**హుస్నాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలంలో కోతుల దాడితో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని రెడ్డి కాలనీలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై కోతులు అకస్మాత్తుగా దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి.పట్టణంలో కోతుల తీవ్రత అధికంగా ఉందని, పలుమార్లు అధికారులు, నాయకులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులు




**కరీంనగర్ రూరల్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనవరి 27న బొమ్మకల్ గ్రామంలో తన వన్‌ప్లస్ ఫోన్ పోగొట్టుకున్న యశ్వాడ బాల సరస్వతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.సీఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ మహారాష్ట్రలో ఉన్నదని గుర్తించి, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ విశ్వతేజ రికవరీ చేశారు.గురువారం నాడు రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను సంబంధిత యజమాని బాల సరస్వతికి అప్పగించారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో అప్పీల్ సంస్థ కార్యక్రమం

**అమ్రాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడుమిల్ల గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి బాలికలకు అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా



విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు జి. వెంకటేశ్వర్లు, గోళ్ల రమేష్ పాల్గొని విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన పాఠ్య సామగ్రిని అందజేశారు. చెంచు గిరిజన తెగకు చెందిన బాలికలతో పాటు ఎస్సీ, బీసీ మరియు ఇతర వర్గాల విద్యార్థినులు కూడా ఈ కార్యక్రమంలో లబ్ధి పొందారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థినులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు విద్యార్థినులకు పరీక్షల్లో విజయవంతం కావడానికి సూచనలు ఇచ్చారు. ప్రొఫెసర్ గోళ్ల రమేష్ మహాభారతంలోని ప్రేరణాత్మక కథలను ఉదాహరణగా చెబుతూ విద్యార్థినులను ప్రోత్సహించారు. అదేవిధంగా నాటిక ప్రదర్శన చేసిన ఆరుగురు విద్యార్థినులకు రూ.1,200 నగదు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. కృష్ణ, మాజీ మండల విద్యా అధికారి దేవదానం, టీచర్ బాలరాజు, శివ, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థినులకు ఉత్సాహాన్ని నింపడంతో పాటు వారి విద్యాభివృద్ధికి దోహదపడింది.

# గొంగడి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు



**పెద్దపల్లి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వినూత్న నిరసన కార్యక్రమం గొంగడి ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, మండల అధ్యక్షుడు చంద్రమౌళి యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ మండలాల నుండి గొర్రెల కాపరులు తమ సంప్రదాయ వస్త్రమైన గొంగడి ధరించి 23న కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలని కోరారు.మార్కెట్ స్థలాల పరిరక్షణ, గొర్రెల పెంపకానికి సబ్సిడీలు, పశువైద్య సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా పూర్తిగా శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతుందని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని మండలాల గొర్రెల కాపరులు, రైతులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు



**పెద్దపల్లి, మార్చి (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్గాం మండల కేంద్రంలో ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా పిల్లల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ వెంకటస్వామి సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా డీసీపీ బి. రామ్ రెడ్డి, ఎస్.పి. నాయక్ బంజారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. చెడు స్నేహాలు, ప్రలోభాలకు లోనుకాకుండా లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ బానిసైతే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటుందని, ఇది వ్యక్తిగత సమస్య మాత్రమే కాక సమాజానికి కూడా ప్రమాదకరమని అన్నారు.సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగం వద్ద వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వినియోగించకపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఎం. రమేష్, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ వెంకటస్వామి, ఎంవీఐ సంతోష్ రెడ్డి, మండల సర్పంచులు, దాదాపు 300 మంది ప్రజలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగాధర రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మించాలని ప్రజల డిమాండ్



**గంగాధర, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో రైల్వే స్టేషన్ పరిధిలోని తుర్కాశి నగర్ రైల్వే గేట్ టి/29 వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఐచర్ లారీ గేటు వద్ద చెడిపోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్, జగిత్యాల వైపు వెళ్లే వాహనదారులు సుమారు అరగంటపాటు ఇరుక్కుపోయారు.సాయంత్రం ఉద్యోగులు, అధికారులు ఇంటికి వెళ్లే సమయమై ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో స్థానికులు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకొని రైల్వే గేట్ పై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

## ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కొండల్ రెడ్డి

**వంగూరు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన బి.కొండల్ రెడ్డిని ప్రభుత్వ ఉపాధ్యాయులు అభినందించారు.మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొండల్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తాను" అని తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వంగూరు ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ మండలం దుబ్బతండా, కుంటకింది తండా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజా ప్రభుత్వంలో పేదల కలలను ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేర్చడం సంతోషంగా ఉంది. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో ప్రజా సంక్షేమం సాధిస్తున్నాం" అని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## గ్రామాల మౌలిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



**శాలిగౌరారం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గామాల మౌలిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు దండ అశోక్ రెడ్డి, భైరవుని బండ సర్పంచ్ నరిగె యాదయ్య అన్నారు.99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని భైరవునిబండ గ్రామం లో భువనగిరి ఎంపీ చామల,తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ ల సహకారం తో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డును గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండ శ్రీలత-కృష్ణా రెడ్డి,మాజీ సర్పంచ్ నరిగే శంభయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు పడాల శంకరయ్య,వార్డు మెంబర్లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే సొంత ఇంటి కల నెరవేరుతుంది

**-- సర్పంచ్ దేవేందర్ నాయక్**



**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, "ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుంది. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోంది" అని తెలిపారు. గ్రామంలో ఎవరికైనా ఇల్లు అవసరమైతే తెలియజేయాలని, సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

**-- నయీమ్ ఖాన్, మహిపాల్ గౌడ్**



**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపులి నాగారం జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వార్డు సభ్యులు నయీమ్ ఖాన్, మహిపాల్ గౌడ్ మాట్లాడుతూ, "కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయి. పరీక్షల్లో ధైర్యంగా రాయాలి" అని సూచించారు. విద్యార్థులకు ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. గ్రామానికి చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధిస్తే బహుమతులు అందజేస్తామని తెలిపారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వెంకటేశ్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్వకోల్ సర్పంచ్ లక్ష్మమ్మ రవి మాదిగకు సన్మానం



**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకోల్ గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ రవి మాదిగను తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యుడు చిక్కిరి శ్రీకాంత్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దళిత బిడ్డలకు న్యాయం కోసం పోరాడిన రవి మాదిగ, గ్రామ సర్పంచ్‌గా గెలిచి ప్రజల పక్షాన నిలుస్తున్నారు. గ్రామ సమస్యలు తెలిసిన వెంటనే పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు" అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# మహేశ్వరం నూతన సీఐ రాఘవేందర్ రెడ్డికి సన్మానం



**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం నూతన సీఐ ఎస్.రాఘవేందర్ రెడ్డిని మాజీ సర్పంచ్ దేశపాగ కళావతి కిష్టయ్య శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మండలంలో మద్యం, డ్రగ్స్ సమస్యలు పెరుగుతున్నాయి. శాంతిభద్రతలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలి" అని కోరారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు షేఖ్ జావీద్ పాల్గొని సీఐ రాఘవేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# నాగిళ్లలో వృద్ధుడు ఆత్మహత్య

**మాడుగుల, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన జక్కుల ముత్యాలు (80) ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదుదారు జక్కుల గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం, ముత్యాలు కొంతకాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతూ ఎర్రగడ్డలో చికిత్స పొందుతున్నారు. నిన్న మధ్యాహ్నం ఆయన పెద్ద కుమారుడు రాకేష్‌తో మాట్లాడిన తరువాత రాత్రి ఇంట్లో రేకుల రాడ్‌కు తాడు కట్టి ఉరి వేసుకున్నారని పక్కింటివాడు బొల్లు యాదయ్య సమాచారం ఇచ్చాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మాడుగుల సీఐ వేణుగోపాల్ తెలిపారు.

# భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ చికోటి ప్రవీణ్






**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల సిరిగిరిపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాసుల సురేష్ మాట్లాడుతూ, "భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ చికోటి ప్రవీణ్ నియమితులైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించాం" అని తెలిపారు. డాక్టర్ చికోటి ప్రవీణ్‌కు రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుమ్మలూరు సీనియర్ నాయకులు కృష్ణ యాదవ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంచర్‌లో అక్రమ మట్టి తవ్వకాల పై ఎస్ఓటి దాడులు



**షాద్‌నగర్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విత్యాల గ్రామపంచాయతీ పరిధిలోని శ్యామలబండ తండాలో అగ్రిగోల్డ్ వెంచర్‌లో రహస్యంగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను ఎస్ఓటి పోలీసులు అర్ధరాత్రి దాడి చేసి అడ్డుకున్నారు. వివాదాస్పదంగా ఉన్న ఈ వెంచర్‌లో కొంతకాలంగా పది ఎకరాల వరకు మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రివేళ టిప్పర్ లారీలతో మట్టి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి జరిపారు. దాడిలో మూడు టిప్పర్ లారీలు, ఒక జెసిబి వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని షాద్‌నగర్ పట్టణ సీఐ కె.సీతారాం వెల్లడించారు.

### నూతన వదూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి



**దోమ మండలం మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దోమ మండలం తిమ్మాయిపల్లి రోడ్ లోని ఎస్ జీ గార్డెన్ లో దోమ మండలం బాస్పల్లి గ్రామానికి చెందిన రమాకాంత్ అనితల వివాహానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, దోమ మండల మాజీ సర్పంచుల నేత కె.రాజిరెడ్డి బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు లతో కలిసి నూతన వదు వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవిత పోరాటం ఫలించింది

**– జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**



**కందుకూరు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదల ఇళ్ల కూల్చివేతపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరంతర పోరాటం ఫలించింది. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులకు ఇళ్ల స్థలాలు, పట్టాలు అందజేయాలని నిర్ణయించింది. జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, "పేదల పక్షాన నిలబడితే ఫలితం తప్పక వస్తుంది. కవితక్క పట్టుదలతో ప్రభుత్వం దిగొచ్చింది. బాధితుల చేత పట్టాలు అందించడం చారిత్రాత్మక విజయం" అని అన్నారు. కవిత నిరాహార దీక్ష విరమించగా, ఈ విజయం జాగృతి కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు.

# దండుమైలారం విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు పంపిణీ



**దండుమైలారం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జెడ్పీహెచ్‌ఎస్ దండుమైలారం పాఠశాలలో యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇష్టపడి చదివితేనే మంచి మార్కులు సాధించి పదో తరగతి విజయవంతంగా పూర్తి చేయగలరు" అని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీఈఓ సుశీంద్రరావు, యూత్ ఫర్ సేవ సభ్యుడు అరవింద్ గౌడ్‌లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఏపీసీ చైర్మన్ శోభ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామకృష్ణ, వెంకటరమణ, శ్రీదేవి, నివేదిత, సులోచన, సుమలత, సుజాత, పుణ్యవతి, అనిత, రామేశ్వరి, విజయ, పూజారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యర్థాలపై అవగాహన




**మంచాల, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామపంచాయతీ పరిధిలో పెద్ద వ్యర్థాల ఉత్పత్తిదారులు, దుకాణదారులు, మాంసం--చేపల విక్రేతలకు వారి దుకాణాల్లో మిగిలిన వ్యర్థ పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మానిపాటి శోభ, ఉపసర్పంచ్ నూకం విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వార్డు సభ్యులు సాతిరి, సత్యం, కొండిగారి శ్రావణ్, లాలగారి మణెమ్మ, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొనసాగిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

**ఎలిగేడు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం గురువారం నాలుగవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర, విధులు, బాధ్యతలపై విపులంగా వివరించారు. శుక్రవారంతో ఈ శిక్షణ కార్యక్రమం ముగియనుంది. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, ట్రైనర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా.వన్నాల వెంకటరమణ



**వర్ధన్నపేట , మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా.వన్నాల వెంకటరమణ నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నియామకం ఈనెల 12 నుండి అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు ను తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమైన డా.వన్నాల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు చేశారు.

గతంలో డా.వన్నాల వెంకటరమణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. తన సేవలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనకు బాధ్యతను అప్పగించినందుకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్,రామచందర్ రావుకు , రాష్ట్ర నాయకులకు, జాతీయ బీజేపీ నాయకత్వానికి వెంకటరమణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డా.వన్నాల వెంకట రమణ బాల్యం నుండి స్వయంసేవక్, శ్రీ గురుకుల విద్యాలయం, మహేశ్వరం, నర్సంపేటలో 5వ తరగతి నుండి ఇంటర్ వరకు విద్యనభ్యసించినారు. తన 9-10 వ తరగతి లో ముఖ్య శిష్యక్ గా, హై స్కూల్ రోజుల్లో వర్గల్లో ఆర్ఎస్ఎస్ శిబిరాలకు హాజరయ్యేవారు. వెంకటరమణ తండ్రి మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు , బీజేపీ మాజీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గా ఉన్నారు. జన సంఘ్ తదనంతరం.. బీజేపీలో ఉండి ఒక పర్యాయం వర్ధన్నపేట ఎమ్మెల్యేగా సేవలందించారు.

వన్నాల వెంకటరమణ వృత్తిరిత్య డాక్టర్. వీరు ఎం.డి.ఎస్, పి.హెచ్.డి దంతవైద్య నిపుణులుగా ప్రొఫెసర్ గా దేశ విదేశాలలో తమదైన విశిష్ట సేవలందించారు. అంతేకాకుండా డా.వన్నాల వెంకట రమణ ఇరవై ఏళ్లుగా వాక్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. సుమారుగా 500 కుటుంబాలకు ప్రతీ నెల 10 కిలోల సన్నబియ్యం, తల్లి/తండ్రిని కోల్పోయిన, అనాథ పిల్లలకు తమ చదువులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు పాఠశాల, కళాశాల ఫీజులు కడుతూ ఎందరో విద్యార్థులకు పార్య పుస్తకాలు, నోట్ బుక్స్, పరీక్షా సామగ్రిని అందజేస్తూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థికంగా సహకరిస్తు ప్రోత్సహిస్తున్నారు.

రాష్ట్రంలో, వరంగల్ జిల్లాలోని ప్రజలతో మమేకమై బీజేపీ ప్రతీ కార్యకర్తతో, నాయకులతో కలిసి పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని వెంకటరమణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఇఫ్తార్ విందుకు హాజరైన పాపిశెట్టి రాము





**ఆమనగల్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పట్టణానికి చెందిన బురాన్, జహంగీర్ సోదరుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకుడు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆజా మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూమ్, గౌస్, ఖాదర్ ఖాద్రి, మాజీ కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, కోట్ల వెంకటేష్, సంజీవ్‌కుమార్, జహంగీర్, అఫ్జల్, మహబూబ్, జబ్బార్, అలీ, బాబా, నయీం, అబ్బు, ఫరూక్ తదితరులు పాల్గొని విందును విజయవంతం చేశారు.

# జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు



**యాచారం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండలం నక్కర్త మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ సీనియర్లకు వీడ్కోలు చెప్పి, భవిష్యత్తు విజయాలను ఆకాంక్షించారు.ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షా విధానం, మెళకువలు, అత్యధిక మార్కులు సాధించే మార్గాలపై అవగాహన కల్పించారు. పదేళ్ల పాఠశాల ప్రయాణంలో ఏర్పడిన స్నేహాలు, గురువుల బోధన, తరగతి గదుల సందడి, ఆటస్థలంలోని కేరింతలు, భోజనాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు పలికారు.“వీడ్కోలు అంటే విడిపోవడం కాదు, కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం” అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దపులి నాగారం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు





**మహేశ్వరం, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం జిల్లా ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 2025--26 విద్యాసంవత్సరానికి చెందిన మొత్తం 71 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. వీరిలో ఇంగ్లీష్ మీడియం 53 మంది, తెలుగు మీడియం 18 మంది ఉన్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలి. పరీక్షా కేంద్రాల్లో జాగ్రత్తగా రాయాలి. తల్లిదండ్రుల ఆధ్వర్యంలో వెళ్లి పరీక్షలు రాయడం మంచిది. బైకులపై కాకుండా బస్సులో ప్రయాణం చేయాలి” అని సూచించారు.కార్యక్రమంలో 3వ వార్డు సభ్యుడు నయీమ్ ఖాన్, ఆయిల్ మహిపాల్ గౌడ్ విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, పెన్లు, ప్యాడ్లు బహుకరించి, “కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి” అని ఆకాంక్షించారు.వీడ్కోలు వేడుకలో విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కన్నీటి కళ్లతో ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు పలికారు.

# గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకున్న అధికారులు



**మహబూబాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండెన్ ఏజెన్సీ షాప్‌ను సివిల్ సప్లై, విజిలెన్స్ ఒ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో హెచ్‌పీ గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్లు 3, ఇండెన్ గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్ 1, 5 కిలోల ఖాళీ సిలిండర్లు 7, 3 కిలోల ఖాళీ సిలిండర్లు 12, మొత్తం 23 సిలిండర్లు గుర్తించారు.స్వాధీనం చేసిన సిలిండర్లను తగు భద్రత నిమిత్తం హెచ్‌పీ గ్యాస్ గోదాంలో తరలించి భద్రపరిచారు. ఈ ఘటనపై 6-ూా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.తనిఖీల్లో సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణ, టాస్క్ ఫోర్స్ సీఐ వసంత్‌కుమార్, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ వీరలక్ష్మి, స్థానిక ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి :మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ లో జరిగిన పలు వివాహవేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశ్వీరదించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ కార్యక్రమంలోనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కురవి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు



**కురవి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కురవి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుని భావోద్వేగంగా వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ వహీద్, ఉపాధ్యాయులు ముత్యాల శ్రీధర్, వెంపటి విజయ్‌రాజ్, శ్యామలాదేవి, విజయలక్ష్మి, దైద వెంకటేశ్వర్లు, బొందిలి వెంకన్న, గుండోజు నరసింహ చారి, బొంగాని మల్లికార్జునరావు, పగడాల లక్ష్మయ్య, రాజు, పద్మలత, రత్నమాల, బండి రవీందర్, బేతమల్ల ప్రేమ్ సాగర్, తాళ్లపల్లి యాకమ్మ, భూక్య బాలాజీ, రాగం వీరభద్రం, కళావతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో రైస్‌మిల్లర్‌పై కేసు నమోదు



**పెద్దపల్లి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి సుభాష్‌నగర్‌కు చెందిన కొమురవెల్లి రాజేందర్ నిర్వహిస్తున్న “శ్రీ విజయశ్రీ” రైస్‌మిల్‌లో భారీ స్థాయిలో ధాన్యం లోటు బయటపడింది. ఖరీఫ్ సీజన్‌కు గాను కస్టమ్ మిల్డ్ రైస్ అందించేందుకు టీజీఎస్సీఎస్ఎస్సీఎల్ తో ఒప్పందం చేసుకున్న ఈ మిల్లర్ వద్ద అధికారులు ఆకస్మిక తనిఖీ జరిపారు.మార్చి 9న నాయబ్ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) జి.రవీందర్, ఎం.మహేష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ బి.లక్ష్మీనారాయణ తనిఖీ చేయగా 17,406.86 క్వింటాళ్ల ధాన్యం లోటు ఉన్నట్లు గుర్తించారు. ప్రతి క్వింటాల్ విలువ రూ.2,585.03 చొప్పున మొత్తం రూ.4,49,45,043/-గా ఉంటుందని అధికారులు వెల్లడించారు.ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని బియ్యం రూపంలో తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, రికార్డులు ఎవరూ పరిశీలించరని భావించి కొంత ధాన్యాన్ని విక్రయించి వచ్చిన డబ్బులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు అధికారులు తెలిపారు.ఈ అక్రమ చర్యపై పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం రాజేందర్‌ను కోర్టులో హాజరుపరిచారు.

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రతపై అవగాహన



**వెల్దండ, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రణాళిక)లో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ గురువారం ఏడవ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరాణా షాపులు, చెత్త ఎక్కువగా ఉత్పత్తి అయ్యే వ్యాపార కేంద్రాల యజమానులతో సమావేశమై పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రోడ్ల పరిశుభ్రత, చెత్త వల్ల కలిగే అనర్థాలను వివరించి, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. గ్రామాభివృద్ధి, ప్రజా ఆరోగ్యానికి పరిశుభ్రత కీలకమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు పాలాది రంగనాథం, జంగలి సునీత ఆనంద్, మారేపల్లి శ్రీను, పిల్లి దేవేందర్, ముదికొండ రమేష్, మసిగుండ్ల వెంకటేష్, శిరసనగండ్లా శేఖర్, రేవల్లి రాజు, రాఘవరెడ్డి, పిట్ల సుధాకర్, మల్లేష్, బడక రామకృష్ణ, దర్గయ్య, బయ్య మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారక్షణలో పోలీస్ మార్క్ కనిపించాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఎమ్మెల్యేను కలిసిన నూతన ఎస్.హెచ్.ఓ



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** న్యాయంకోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపి, పోలీస్ మార్క్ కనబరచాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నూతన ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు కు సూచించారు. ఆమనగల్లు నూతన ఎస్.హెచ్.ఓ గా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు హైద్రాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లులో ప్రజలు శాంతియుత జీవనం గడిపేలా పోలీసులు కృషి చేయాలన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల పట్ల సహృదయంతో వ్యవహరించి న్యాయం జరిగేలా చూడాలన్నారు.

## జంగారెడ్డిపల్లి పాఠశాలలో టీచర్ నియామకంపై వినతి



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో జంగారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు యాదవ్ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. వెంటనే కొత్త టీచర్‌ను నియమించి విద్యా సంవత్సరాన్ని కాపాడాలని, విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను కోరారు.

# అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం మంత్రి సీతక్కకి వినతిపత్రం



**మహబూబాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ కౌన్సిలర్లు, ఏఐటియుసి నేతలు మంత్రివర్యులు సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ, "1975 నుంచి గౌరవ వేతనం పేరుతో అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. తక్కువ వేతనం కారణంగా కుటుంబ పోషణ భారంగా మారింది. టీచర్లకు కనీస వేతనం రూ.26,000, హెల్పర్లకు రూ.21,000 ఇవ్వాలని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో సమ్మెల అనంతరం టీచర్లకు రూ.18,000, హెల్పర్లకు రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. రిటైర్మెంట్ అవుతున్న టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష ఇవ్వాలని జి.ఓ. కూడా జారీ చేశారు. దానిని వెంటనే అమలు చేయాలి" అని తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన మంత్రివర్యులు సీతక్క మాట్లాడుతూ, "త్వరలో నియామక ప్రక్రియకు చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ 18వ వార్డు కౌన్సిలర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న మంత్రి సీతక్క




**మహబూబాబాద్, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజాప్రతినిధులు 99 రోజుల్లో 10 అంశాలపై ప్రణాళికలు రూపొందించి గ్రామాలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సును మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "70 సంవత్సరాల్లో కోయ జాతికి ఈ పదవి రాలేదు. కావాలనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను స్వీకరించాను" అని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల హాజరు తక్కువగా ఉందని కలెక్టర్‌ను హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్రం ప్రకటించిన 10 జలశక్తి అవార్డుల్లో 8 అవార్డులు తెలంగాణకే వచ్చిన విషయాన్ని గుర్తుచేసి, ఏప్రిల్‌లో ప్రకటించే అవార్డుల్లో ప్రతి ప్రజాప్రతినిధి తమ గ్రామం అభివృద్ధి ద్వారా అవార్డులు సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. మొదటి స్థానానికి రూ.1 కోటి, రెండో స్థానానికి రూ.75 లక్షలు, మూడో స్థానానికి రూ.40 లక్షలు లభిస్తాయని, ఈ నిధులతో గ్రామాలను సస్యశ్యామలం చేయవచ్చని వివరించారు. గ్రామాలకు వచ్చిన ఫైనాన్స్ నిధులను గ్రామసభల్లో తీర్మానం చేసి ఖర్చు చేయాలని, దుర్వినియోగం చేస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజాప్రతినిధులకు అందజేసిన పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలని సూచించారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల రూపాయలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, అనిల్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు ఉప్పల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు మైనారిటీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖలీల్ గురువారం ప్రకటించారు. పట్టణ కేంద్రంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్లో మార్చి 13న సాయంత్రం 6 గంటలకు ఈ విందు జరుగనుంది. ఉప్పల వెంకటేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొననున్నారు. ముస్లిం సోదరులు పెద్దఎత్తున ఈ ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ మాసపు పవిత్రతను మరింతగా వెలిగించాలని ఉప్పల వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, మార్చి 12 నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండలంలోని గడ్డమీద తండాకు చెందిన ఇస్లావత్ సాలి భాష్యం కూతురు శివాని నిరుపేద వివాహానికి గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా రూ. 5, వేల ఆర్థిక సహాయాన్ని మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, గడ్డమీద తండా ఉపసర్పంచ్ రమణలతో కలిసి పెళ్లికూతురు శివాని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఆర్థిక సహాయం అందజేస్తూ వారికి చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి చందు, రమణ, సురేష్, ఎస్ రవి, సి సోమ్లా, ఎస్ బన్సీలాల్, ఈ మల్లేష్, చందర్, ఈ హేమ, సి ప్రవీణ్, జై గణేష్, ఈ రమేష్, శ్రీ బాలాజీ, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, వైస్‌చైర్‌పర్సన్ తల్లోజు గీత ఆచారి గురువారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కీలక విభాగాల్లో 25 పోస్టులకు గాను కేవలం 5 మంది మాత్రమే పనిచేయడం వల్ల అభివృద్ధి పనులు జాప్యం అవుతున్నాయని వారు తెలిపారు. రెవెన్యూ సెక్షన్ మేనేజర్ ఘట్కేసర్‌లో డిప్యూటేషన్‌లో ఉండటం, సానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటం, ఏఈటిపిఓ ఇన్‌చార్జ్ వారంలో ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే రావడం వల్ల ప్రజలకు సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విన్నవించారు. 15 మంది వార్డ్ ఆఫీసర్లలో కేవలం ఒకరు మాత్రమే పనిచేయడం వల్ల ప్రాపర్టీ టాక్స్ వసూలు వెనుకబడిందని, ప్రజలకు సేవలు అందించలేకపోతున్నామని వారు వాపోయారు. వెంటనే ఈ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్ సభ్యులు అనిత శ్రీనివాస్ రెడ్డి, సునీత ప్రశాంత్, భాగ్యమ్మ రఘు, అనూష శ్రీశైలం, యశోదమ్మ, ధోలి ఎనుమల్ల రమేష్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, నాగిళ్ళ జగన్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

# ప్రజాప్రతినిధులు--అధికారులు కలిసికట్టుగా పనిచేస్తేనే పేదల అభివృద్ధి సాధ్యం






**రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**రంగారెడ్డి, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తేనే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయి. ప్రజలతో మమేకమై పనిచేస్తేనే వారి మన్ననలు పొందగలరు. పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి. విద్యతోనే మార్పు వస్తుంది. ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలి. పారిశుధ్యం, తాగునీటి సమస్యలు, ఆరోగ్య కేంద్రాల పనితీరుపై దృష్టి సారించాలి. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు.రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ, "నూతన ప్రజాప్రతినిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, ప్రజాక్షేత్రంలో ఉండి సేవ చేయాలి" అని పిలుపునిచ్చారు.జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "99 రోజుల కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి. అధికారులు--ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి. ఉగాదికి సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాల కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, వీడియోల ద్వారా పథకాలపై అవగాహన కల్పించారు. ఆర్కెవీవై కూరగాయల కిట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ప్రజల కోసం ఉచిత అంబులెన్స్ సేవ ప్రారంభం



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు ప్రాంత ప్రజల సౌకర్యార్థం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవను గురువారం పట్టణ కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ, "అత్యవసర పరిస్థితుల్లో ఆమనగల్లు పరిసర ప్రాంతాల ప్రజలు కేవలం ఇంధన చార్జీలు చెల్లించి హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వెళ్లేందుకు ఈ వాహనం అందుబాటులో ఉంటుంది. ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందుతాయి. ఆరోగ్య సంరక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు.ప్రజల కోసం చేపట్టిన ఈ సేవను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మేడిశెట్టి శ్రీధర్, కండె భాస్కర్,రవి రాథోడ్, పద్మ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో మంచాల మండలం

**తాజాగా మరో 5.30కోట్ల నిధులు మంచాల మండలానికి మంజూరు**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం , మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని మంచాల మండల అభివృద్ధికై ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధిక నిధులు తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు గురువారం మంచాల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నారని అన్నారు తాజాగా మండలంలోని ఆరుట్ల గ్రామానికి 90 లక్షలు లోయపల్లి గ్రామానికి 50 లక్షలు నోముల 50 లక్షలు తిప్పాయిగూడ 25 లక్షలు ఎల్లమ్మతండా 25 లక్షలు రంగాపూర్ 25 లక్షలు లింగంపల్లి 75 లక్షలు బండలేమూరు 25 లక్షలు జాపాల 50 లక్షలు కాగజ్ ఘాట్ 25 లక్షలు ఆగాపల్లి 25 లక్షలు దాద్ పల్లి 25 లక్షలు చెన్నారెడ్డి గూడ 20 లక్షలు చిత్తాపూర్ 20లక్షలు మొత్తం 5.30 లక్షలు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఎవీణూ నిధుల నుండి మంజూరైనట్లు తెలిపారు త్వరలో మంచాల మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడానికి మరిన్నినిధులు రాబోతున్నాయని అన్నారు మంచాల మండల అభివృద్ధికి కంకణబద్దులై అధిక నిధులు కేటాయించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మండల ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# బై.. బై..

## ముగిసిన 'ఇంటర్ ప్రథమ' పరీక్షలు



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఫిబ్రవరి 25న ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. పరీక్ష అనంతరం ఆయా సెంటర్ల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులు ఫ్రెండ్స్‌తో సెల్ఫీలు దిగుతూ, బై బై చెప్పుకొంటూ కనిపించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థుల ముఖాల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రశ్నపత్రం సులువుగా వచ్చిందని, మంచి ర్యాంకు సాధిస్తామని ఆమనగల్లు మండలానికి చెందిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ధీమా వ్యక్తం చేశారు. లెక్చరర్లు అందించిన సూచనలు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పరీక్షలను సమర్థంగా ఎదుర్కొన్నామని తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు.

# ఆర్యవైశ్యుల శక్తి అపారం

-వాసవీ పారాయణం ప్రపంచ రికార్డు సాధించాలి
-- మంత్రి వాకిటి శ్రీహరి







**హైదరాబాద్, మార్చి 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆర్యవైశ్య సమాజం శక్తి అపారం అని, వారు సంకల్పిస్తే రాజకీయాలపై కూడా ప్రభావం చూపగలరని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. సమాజం రాజకీయ రంగంలో మరింతగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ రికార్డు సృష్టించే లక్ష్యంతో ఆర్యవైశ్యులు చేపడుతున్న వాసవీమాత పారాయణం అభినందనీయమని అన్నారు.హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం దద్దరిల్లేలా వేలాదిమంది పాల్గొనే విధంగా వాసవీమాత సామూహిక పారాయణం నిర్వహించాలన్న సంకల్పం గొప్పదని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎవరూ అధిగమించలేని విధంగా ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు స్థాయిలో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ మహోత్సవంలో తాను కూడా పాల్గొంటానని తెలిపారు.

ఈ నెల 22న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న "శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం" సామూహిక పారాయణానికి సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం గురువారం బంజారాహిల్స్‌లోని పార్క్ హోటల్‌లో జరిగింది. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వ సుజాత గుప్తా తీసుకున్న సంకల్పాన్ని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఐఅండ్‌పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆకాంక్షించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్తా మాట్లాడుతూ, 21 వేల మందితో సామూహిక [illegible] నిర్వహించేందుకు ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. పాల్గొనే వారికి తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ పారాయణం ప్రపంచ రికార్డు సృష్టించబోతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాల వాసవీమాత స్తుతిగీతాన్ని ఆలపించారు. వాసవమ్మ జాతరకు తరలిరావాలంటూ ప్రముఖ జర్నలిస్టు, మఖన్‌లాల్ చతుర్వేది జర్నలిజం యూనివర్సిటీ బోర్డు సభ్యుడు రావికంటి శ్రీనివాస్ రచించి రూపొందించిన గీతాన్ని దృశ్యరూపంలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కొణిజేటి సుబ్బారావు, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చీకోటి ప్రవీణ్, కాచం సత్యనారాయణ, మలిపెద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకే కంటి పరీక్షలు

**- లయన్ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి**



**ఆమనగల్లు, మార్చి 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కంటి పరీక్షలు నిర్వహిస్తోందని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని నివారించేందుకు సీనియర్ లయన్ డాక్టర్ దామోదర్ రెడ్డి సహకారంతో గురువారం కడ్తాల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో 255 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అందులో 35 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కడ్తాల్ లోని మూడు ఉన్నత పాఠశాలలో 'సమాజ సేవలో లయన్స్ క్లబ్ సేవలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో విజేత విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఖజాంచి శ్రీనివాస్ రెడ్డి, జంగయ్య పిప్పల్ల, వెంకటేష్ గూడె, రాజేందర్ క్యామా, రాజేష్ భాను, కిరణ్, శ్యామ్ గౌడ్, మరియు ఆయా ప్రధానోపాధ్యాయులు అరుణ, జంగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.